ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 23-05-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

ముఖ్యాంశాలు

- ఉగ్రవాదం, వాపమక్ష తీవ్రవాదాలపై భారత్ జీరో టాలరెన్స్ విధానాన్ని పాటిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.
- సాయుధ దళాల అద్భుత పనితీరుతో ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు.
- స్థిరత్వం సాధించే దిశగా వివిధ దేశాలు కలిసి పనిచేయాల్సిన ఆవశ్యకత ఉందని కేంద్ర మంత్రి ఎస్. జైశంకర్ అభిప్రాయం వ్యక్తం చేశారు.
- బ్రిక్స్ దేశాల మధ్య ఎగుమతులపై నియంత్రణను తొలగించాలని భారతదేశం సభ్యదేశాలకు పిలుపునిచ్చింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉగ్రవాదం, వామపక్ష తీవ్రవాదాలపై తమ ప్రభుత్వం జీరో టోలరెన్స్ విధానాన్ని పాటిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు రైజింగ్ నార్త్ ఈస్ట్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌ను ప్రారంభించిన ఆయన.. భారత దేశ అభివృద్ధి కోసం ఈశాన్య రాష్ట్రాలను అభివృద్ధి చేయడం ఆవశ్యకమని పేర్కొన్నారు. ఇంధనం, సెమీకండక్టర్ల వంటి రంగాలకు ఈశాన్య ప్రాంతం కీలక గమ్యస్థానంగా మారుతోందన్నారు. ఈశాన్య ప్రాంతం భారతదేశంలో అత్యంత వైవిధ్యమైన ప్రాంతమని.. ఈ వైవిధ్యమే దేశానికి బలమని వివరించారు. ఈశాన్య ప్రాంతం సరిహద్దు మాత్రమే కాదని, వృద్ధిలో కూడా ముందంజలో ఉందని తెలిపారు. ఈ ప్రాంతంలో పర్యాటకం, ప్రపంచ సమావేశాలు, సదస్సులు, గమ్యస్థాన వివాహాలకు అవకాశాలు మెండుగా ఉన్నాయని చెప్పారు.

(వాయిస్ బైట్...33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పహల్గామ్ దాడికి ఆపరేషన్ సిందూర్ సరైన సమాధానమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన సరిహద్దు భద్రతా దళం వేడుకలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ.. భారత్ ప్రతీకార చర్యలో భాగంగా BSF, సాయుధ దళాలు పాకిస్తాన్‌పై గొప్ప శౌర్యాన్ని ప్రదర్శించాయని అన్నారు. పాకిస్తాన్ సైన్యం భారతదేశ పౌర, సైనిక స్థావరాలపై దాడికి ప్రయత్నించిన సమయంలో భారత సైన్యం బలమైన సమాధానం ఇచ్చి, పాకిస్తాన్ వైమానిక స్థావరాలపై దాడి చేసిందన్నారు. భారతదేశం అనేక దశాబ్దాలుగా పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటోందని చెప్పారు. 2014లో తొలిసారిగా భారత సైన్యం ఉగ్రవాదుల రహస్య స్థావరాలలోకి చొరబడి దాడులు చేయడం ద్వారా ఉగ్రవాదులకు తగిన సమాధానం చెప్పిందన్నారు. నేడు ప్రపంచం మొత్తం భారత సాయుధ దళాల ధైర్యాన్ని ప్రశంసిస్తోందన్నారు. ప్రభుత్వ బలమైన సంకల్పం, నిఘా సంస్థల కచ్చితమైన సమాచారం, సాయుధ దళాల అద్భుత పనితీరుతో ఆపరేషన్ సిందూర్ విజయవంతమయ్యిందని హోంమంత్రి అమిత్ షా వివరిస్తూ...

(వాయిస్ బైట్...30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కాల్పుల విరమణ ఒప్పందం ద్వారా భారత్.. పాకిస్తాన్‌తో ఉన్న వివాదాన్ని ప్రస్తుతానికి పరిష్కరించుకుందని, దీనిపై ఇరు దేశాల మధ్య నేరుగా చర్చలు జరిగాయని భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ తెలిపారు. విదేశీ పర్యటనలో ఉన్న ఆయన డెన్మార్క్‌లో ఒక వార్తా ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో, ఇటీవల భారతదేశం తీవ్రమైన ఉగ్రదాడిని ఎదుర్కోవలసి వచ్చిందని, దానికి పర్యవసానంగా మే 10వ తేదీన భారత్... పాకిస్తాన్‌ను తీవ్రంగా దెబ్బతీసిందని చెప్పారు. ఉగ్రవాదులు పొరుగు దేశంలో ఉంటూ.. ఆ దేశ మద్దతుతో పనిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. భారతదేశం చారిత్రాత్మకంగా తనను తాను కాపాడుకుందని అన్నారు. ఇది అనిశ్చితి, అస్థిరతల యుగమని, భారత్ దీనిని మరింత సమదృష్టితో ఎదుర్కొంటుందని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో వివిధ దేశాలు, ప్రాంతాలు స్థిరత్వం సాధించే లక్ష్యంతో కలిసి పనిచేయడం చాలా అవసరమని జైశంకర్ పేర్కొంటూ..

(వాయిస్ బైట్...28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బ్రిక్స్ దేశాల మధ్య ఎగుమతి నియంత్రణలను తొలగించాలని భారతదేశం పిలుపునిచ్చింది. బ్రెజిల్ అధ్యక్షతన జరిగిన బ్రిక్స్ వాణిజ్య మంత్రుల సమావేశంలో ఈ విజ్ఞప్తి చేశామని అధికారిక ప్రకటన వెల్లడించింది. 2026లో భారత్... బ్రిక్స్ అధ్యక్ష పదవిని చేపట్టనున్న నేపథ్యంలో ఈ నెల 21వ తేదీన బ్రెజిలియాలో జరిగిన సమావేశంలో కీలకమైన వాణిజ్య సమస్యలను పరిష్కరించడంలో బ్రెజిల్ అనుసరించిన విధానాన్ని భారత్ ప్రశంసించింది. భారత వాణిజ్యం, పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్ తరపున చేసిన ప్రసంగంలో.. ఏకాభిప్రాయాన్ని పెంపొందించడంలో బ్రెజిల్ చేస్తున్న కృషికి భారత్ కృతజ్ఞతలు తెలిపింది. అలాగే.. 2025లో ఇండోనేషియా బ్రిక్స్ సభ్యదేశంగా చేరడాన్ని స్వాగతించింది. గ్లోబల్ సౌత్ అభివృద్ధి అవసరాలను తీర్చే వికేంద్రీకృత ప్రపంచ వాణిజ్య నిర్మాణాన్ని ప్రోత్సహించాలని బ్రిక్స్ దేశాలకు భారత్ పిలుపునిచ్చింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ సభ్యులు సంజయ్ ఝా నేతృత్వంలో జపాన్‌కు వెళ్లిన అఖిలపక్ష ప్రతినిధి బృందం ఈరోజు జపాన్‌లోని టోక్యోలో లిబరల్ డెమోక్రటిక్ పార్టీ LDP.. ఉగ్రవాద నిరోధక పరిశోధన కమిటీ యాక్టింగ్ ఛైర్‌పర్సన్, మాజీ న్యాయ మంత్రి యసుహిరో హనాషిని కలిసింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశ ఏకీకృత వైఖరిని ప్రతినిధి బృందం వారికి తెలియజేసింది. ఈ సందర్భంగా ఇరుపక్షాలు ఉగ్రవాదాన్ని సహించేది లేదని స్పష్టంచేశాయి. జపాన్ మాజీ రక్షణ మంత్రి మినోరు కిహారా, LDP అంతర్జాతీయ బ్యూరో డైరెక్టర్ జనరల్ షినాకో సుచియా లతో భారత ప్రతినిధి బృందం చర్చలు జరిపింది. అలాగే.. బ్రెజిల్, ఆస్ట్రేలియా, కొలంబియా, గ్రీస్, దక్షిణ కొరియా రాయబారులు, దౌత్యవేత్తలతో కూడా ప్రతినిధి బృందం చర్చించింది. ఈ సందర్భంగా ప్రపంచంలోని ప్రతి ఉగ్రవాద కార్యకలాపానికి పాకిస్తాన్‌తో కొంత సంబంధం ఉందని సంజయ్ ఝా అన్నారు. భారత పౌరులకు ఏదైనా జరిగితే, ప్రతీకార చర్యలు తప్పవని ఆయన పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాజస్థాన్‌లోని కోటాలో విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుందని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. రాజస్థాన్‌లోని నీట్, ఐఐటీ కోచింగ్ సెంటర్లకు చెందిన 14 మంది విద్యార్థుల ఆత్మహత్యలపై దాఖలైన పిటిషన్లపై అత్యున్నత న్యాయస్థానం ఈరోజు విచారణ చేపట్టింది. పిటిషన్లను విచారించిన జేబీ పార్దివాలా, ఆర్ మహాదేవన్ లతో కూడిన ధర్మాసనం.. విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించింది. ఇది చాలా ఆందోళకరమైన విషయమని, ఈ అంశాన్ని తేలికగా తీసుకోవద్దని హెచ్చరించింది. కాగా.. విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశామని రాజస్థాన్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. తదుపరి విచారణను సుప్రీంకోర్టు జూలై 14వ తేదీకి వాయిదా వేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దక్షిణ కొంకణ్ - గోవా తీరానికి అవతల తూర్పు - మధ్య అరేబియా సముద్రంపై ఏర్పడిన అల్పపీడనం గోవా తీరానికి సమీపంలో కొనసాగుతోందని, అది వాయుగుండంగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. దక్షిణ కొంకణ్, కర్ణాటక, మధ్య మహారాష్ట్ర, గోవాలలో భారీ వర్షాలకు సంబంధించి ఎరుపు, నారింజ హెచ్చరికలను జారీ చేసినట్టు తెలిపింది. రానున్న రెండు, మూడు రోజుల్లో నైరుతి రుతుపవనాలు కేరళలో ప్రవేశించడానికి అన్ని పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని సీనియర్ శాస్త్రవేత్త ఆర్.కె. జెనామణి తెలిపారు.